నేటి దినపత్రిక
17వ వసంతంలోకి..
సూర్య
ఎన్టీఆర్ - కృష్ణా
బుధవారం 7 ఆగస్టు 2024 పేజీలు 8

## నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకం



వివరాలు 2లో

మధ్యాహ్న భోజన పథకం

## పటిష్టంగా అమలు

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



వివరాలు 2లో

# పొలిటికల్ గవర్నెన్స్‌కు శ్రీకారం

- భద్రత పెంచాలని జగన్ అడుగుతున్నారు
- జగన్ నుండి భద్రత కావాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు
- అరాచకాలు సాగడం లేదనే పేర్ని నాని సహా వైసీపీ నేతల ఏడుపు
- సీఎం వ్యాఖ్యల్ని కూడా వక్రీకరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఐదేళ్ల తర్వాత ప్రజాస్వామ్య బద్దంగా నడుస్తున్న పాలన చూసి వైసీపీ నేతలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అందుకే రెడ్ బుక్ పేరుతో పిచ్చి పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. సచివాలయానికి వస్తూ మధ్యలో మీడియాతో మాట్లాడారు జగన్ రెడ్డి పాలనంతా దోచుకోవడం, దాచుకోవడం, ఖజానా నింపుకోవడానికే ప్రాధాన్యమిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఎలా రాళ్లు వేయాలా అనే ఆలోచన తప్ప సహకరించాలనే కనీస ఆలోచన కూడా వారు చేసింది లేదు అన్నారు. ఐదేళ్లుగా అరాచకాలకు పాల్పడిన జగన్ రెడ్డి ముఠా ఎక్కడ దాక్కున్నా వదిలి పెట్టేదే లేదు. అందరినీ వెతుక్కుని వచ్చి చట్ట ప్రకారం శిక్షించి తీరుతాం అన్నారు. ప్రజాస్వామ్య పాలన చూసి ఏడుపెందుకు ప్రజలకు ప్రజాస్వామ్యబద్ధమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. జగన్ రెడ్డి రాళ్లేయాలనుకుంటు న్నాడని మండిపడ్డారు. మంత్రులందరికీ గ్రూప్ పెట్టి, సమస్యలపై చర్చిస్తుంటే.. దానికి కూడా వక్రభాష్యం చెప్పడానికి సిగ్గుపడాలన్నారు. ఐదేళ్ల పాటు కనీసం ప్రజా సమస్యలపై చర్చించని వారికి ఇలాంటి పాలన చూస్తే ఏడుపు తప్ప ఇంకేముంటుందన్నారు. గతంలో వాట్స ప్ అంటే ఏం చేశారో ఒక ఎంపీ నిరూపించాడు. వా రి బుద్ధి అంత వరకే ఉంటుందని బందరు పిచ్చోడు మరోసారి నిరూపించాడు. ప్రజల అభిప్రాయాలు, వారి సమస్యలు తెలిపేందుకు సత్వర మార్గంగా ఏర్పా టు చేసిన వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత వారికి ఉందా అని ప్రశ్నించారు. ప్రజలకు సత్వర న్యాయం చేసేలా పొలిటికల్ గవర్నెన్స్ ప్రజలకు సత్వరన్యాయం అందించే లక్ష్యంతో త్వరలోనే మిగతా 2లో



బాలికపై లైంగిక దాడి

## అమానవీయం, అమానుషం

- దోషిని ఖఠినాతి కఠినంగా శిక్షిస్తాం...
- ఇటువంటి దాడులను సమాజంలో ప్రతిఒక్కరు ఖండించాలి
- సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి

2



## సీఎం దార్శనికతకు అనుగుణంగా కార్యాచరణ

- మాస్టర్ ప్లాన్‌ల ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలి
- పేదరిక నిర్మూలన, సుస్థిర జీవనోపాధి కల్పన, నైపుణ్యాల పెంపుపై దృష్టిపెట్టాలి
- సామాజిక ఆస్తుల సృష్టి ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణా కీలకం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా జిల్లాలో అన్ని శాఖల అధికారుల కార్యాచరణ ఉండాలని కలెక్టర్ డా. జి.సృజన స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ సృజన.. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, డీఆర్వో వి.శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. మిగతా 2లో...

## అధికారుల నిర్లక్ష్యం.. ప్రమాదాలకు లక్ష్యం

### ప్రమాదాలకు నిలయంగా వెంకట సాయి ఫుడ్ ప్లాజా బైపాస్




**జగ్గయ్యపేట ఆగస్టు 6 మేజర్ న్యూస్ :** ప్రమాదాలకు నిలయంగా వెంకట సాయి ఫుడ్ ప్లాజా బైపాస్ మారింది. పట్టణ సమీపంలోని ఆటోనగర్ ఉన్న వెంకట్ సాయి ఫుడ్ ప్లాజా వద్ద బైపాస్ వలన 2

- బైపాస్ ప్రజల కోసమా.. ఫుడ్ ప్లాజా కోసమా?
- అండర్ పాసింగులు ఉండగా బైపాస్‌లు ఎందుకో..?
- ప్రమాదాలు జరుగుతున్న చోద్యం చూస్తున్న అధికారులు
- ఈ ప్రమాదాలకు అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు

(మొదటిపేజీ తరువాయి)

## నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకం



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర ఎంతో కీలకమైనదని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర మంగళవారం ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనం లోని మీటింగ్ హాల్లో నిర్వహించిన కాంట్రాక్టర్లతో సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజ్, విజయవాడ అభివృద్ధి పనుల్లో వారి సహకారం, భాగస్వామ్యం, బాధ్యత, కనబడుతుందని. ఏ పని చేసినా నాణ్యత ప్రమాణాలతో చేయాలని. వారికి ఎటువంటి సమస్య ఉన్న కమిషనర్‌కి ప్రత్యక్షంగా తెలుపవచ్చుని. విజయవాడ నగరపాలక సంస్థ అభివృద్ధిలో కాంట్రాక్టర్లది ప్రధాన పాత్ర ఉందని, కాంట్రాక్టర్లు అందరూ ఒక రితో సమన్వయంగా ఉండాలని. నగరాభివృద్ధికి వారి వినూత్న ఆలోచనలు, సూచనలను ఎల్లప్పుడూ సహకరిస్తారని అన్నారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్లు ముందుగా, విజయవాడ నగరానికి ధ్యానచంద్ర కమిషనర్ గా వచ్చినందుకు అభినందనలు తెలుపుతూ, వాళ్లకు రావాల్సిన చెల్లింపులు, డిపాజిట్లు, పనుల్లో వాళ్లకు ఎదురయ్యే ఇబ్బందులు గురించి కమిషనర్‌కి తెలియపరచగా, వారి ప్రతి సమస్యకి ఖచ్చితమైన పరిష్కారం చూపుతామని అన్నారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తో పాటు చీఫ్ ఇంజనీర్ యం. ప్రభాకర్ రావు, సూపరిండెంటింగ్ ఇంజనీరలు నరసింహమూర్తి, రామ్మోహన్ రావు, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణ మూర్తి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## పొలిటికల్ గవర్నెన్స్‌కు శ్రీకారం

పొలిటికల్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. ముఖ్యమంత్రి సాయికి తీసుకెళ్లే సమస్యకు అక్కడ వరకు తీసుకెళ్లే బాధ్యత ప్రజాప్రతినిధులకు అప్పగిస్తాం. అధికారుల వద్దకు తీసుకెళ్ల లేని సమస్యల్ని స్థానిక ప్రజా ప్రతినిధులు పరిష్కరిస్తారు. గత ఐదేళ్ల పాలనలో అధికారులు కూడా బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. కానీ, అధికారులు స్వేచ్ఛగా పని చేసేలా, వారి అభిప్రాయాలు పంచుకునేలా వ్యవస్థల్ని మెరుగుపరుస్తాం. తనకు భద్రత పెంచాలని జగన్ రెడ్డి అడుతున్నారు. కానీ.. జగన్ రెడ్డి నుండి రక్షణ కావాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ఫలితాల రోజునే సగం మంది వైసీపీ నేతలు రాష్ట్రం వదిలి పారిపోయారు. అలాంటి వారిని శిక్షించడానికి రెడ్ బుక్ అవసరం లేదు. ప్రజల్లోకి వస్తే వారే తన్ని తరిమేస్తారు.పేర్ని నానిని తెలంగాణలో తరిమితరిమి కొట్టారు. జగన్ రెడ్డి ఫేక్ రాజకీయాలు మానుకోకుంటే అడ్రస్ గల్లంతు కావడం తథ్యం.

## అధికారుల నిర్లక్ష్యం.. ప్రమాదాలకు లక్ష్యం



ఎందరో ప్రమాదాల బారిన పడిన మృత్యువు చెందిన సంఘటనలు కో కొల్లలు ఈ ప్రమాదాలు వెలుగులోకి వచ్చినవి కొన్ని అయితే వెలుగులోకి రానివి మరెన్నో ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం వెనుక అంతర్యం ఏమిటో.. అని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. కేవలం వెంకట సాయి ఫుడ్ ప్లాజా హోటల్ యజమాని ఇచ్చే మామూళ్ల మత్తులో అధికారులు తూగుతున్నారని స్థానికులు చెప్పుకుంటున్నారు. ఎందరో ప్రమాదాల బారిన పడి మృతి చెందినప్పటికీ అధికార యంత్రాంగం ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంలో విఫలం చెందుతున్నారని ఈ ప్రాంత వాసులు చర్చించుకుంటున్నారు. నేషనల్ హైవే ప్రక్కనే ఉన్న ఈ హోటల్ ఎక్కువగా రద్దీ ఉండటం హోటల్‌కి కూత వేటు దూరంలో అండర్ పాసింగ్ ఉన్నప్పటికీ హోటల్ దగ్గర బైపాస్ ఎందుకు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు హోటల్ యజమానికి లబ్ధి చేకూర్చేందుకే బైపాస్ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ ప్రాంత వాసులు చర్చించుకుంటున్నారు.

**కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న అధికారులు**

ఇప్పటికే జిల్లా కలెక్టర్ జి.సృజన ప్రమాదాల నివారణకు ప్రతిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ స్థానిక అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గౌరవం దగ్గర ఉన్న బైపాస్ వలన ఎన్నో ప్రమాదాలు జరగడంతో అక్కడ బైపాస్ మూసి వేయడం వలన ఎటువంటి ప్రమాదాలు జరగటంలేదని అదే క్రమంలో ఈ వెంకట సాయి ఫుడ్ ప్లాజా వద్ద ఉన్న బైపాస్‌ని మూసివేస్తే ప్రమాదాలు నివారించినట్లేనని స్థానికులు అనుకుంటున్నారు. కనుక ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి ఈ ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలకు నివారణ చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

# సీఎం దార్శనికతకు అనుగుణంగా కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో చర్చించిన కీలక అంశాలతో పాటు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేసిన సూచనలను కలెక్టర్ వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలుబీ పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య ఆరోగ్యం, సహజ వనరులు, సంక్షేమం, గృహ నిర్మాణం.. ఇలా శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో భవిష్యత్తు ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకొని అధికారులు సమన్వయంతో, క్షేత్రస్థాయి అధికారులకు సరైన మార్గనిర్దేశనం చేస్తూ లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమీక్షలు, తనిఖీలు నిర్వహిస్తూ చేపట్టిన పనిలో పురోగతి ఉండేలా చూడాలన్నారు. కార్యాలయ సేవలు, క్షేత్రస్థాయి సందర్శనలకు సమప్రాధాన్యమివ్వాలని సూచించారు. జీరో పావర్టీ సాంఘిక, భౌతిక మౌలిక వసతుల అభివృద్ధి జనాభాలో యువశక్తి, జీవన సౌలభ్యం సంక్షేమ, అభివృద్ధి అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం విజన్ ఆంధ్రా @2047 దార్శనిక ప్రణాళికను రూపొందిస్తోందని.. ఇందుకు జిల్లాపరంగా అవసరమైన నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. పేదల జీవన ప్రమాణాలను పెంచి, వారిని పేదరికం నుంచి దూరంచేసేలా ప్రభుత్వం పేదల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒక్క పారిశ్రామిక రంగంలోనే కాకుండా వివిధ రంగాల్లో ఉద్యోగాల కల్పన, జీవనోపాధి సృష్టిపై దృష్టిసారించాలన్నారు. ప్రజా సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలు నూరుశాతం ఫలితాలిచ్చేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా.. ఇలా ఏ పని చేపట్టినా మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉండాలన్నారు. సామాజిక ఆస్తుల సృష్టిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా ఆధారంగా గ్రామ అభివృద్ధి ప్రణాళికల (వీడీపీ)ను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రూపొందించాలని.. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మంచినీటి కుళాయిల కనెక్షన్లు, మరుగుదొడ్లు, వీధి దీపాలు, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ తదితరాలపై దృష్టిసారించాలన్నారు. శాఖల వారీగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషిచేయాలని.. ఆయా సూచీల్లో ప్రగతి కనబరచాలని సూచించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలు చేపట్టేలా, ఫామ్ పాండ్‌లను అభివృద్ధి చేసేలా చూడాలని కలెక్టర్ సృజన సూచించారు.

**ఈ-పంట బుకింగ్‌పై దృష్టిపెట్టాలి**

లక్ష్యాలకు అనుగుణంగా ఖరీఫ్-2024లో వివిధ పంటల సాగు విస్తీర్ణం ఉండేలా చూడాలని.. అదే విధంగా ఈ ఏడాది సెప్టెం బర్ 15 నాటికి ఈ-పంట బుకింగ్‌ను పూర్తిచేయాల్సి ఉన్నందున అందుకు తగిన కార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. 100 శాతం సీసీఆర్‌సీ కార్డులు పంపిణీని పూర్తిచేయాలని, రుణాలు అందేలా చూడాలన్నారు. భూసార పరీక్షలను పెంచాలని.. సాగు ఖర్చును తగ్గించుకొని దిగుబడులు పెరిగేందుకు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేయాలన్నారు. పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) పెంపునకు కృషిచేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ సాధించాల్సిన లక్ష్యాలతో పాటు ప్రకృతి వ్యవసాయం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాల పెంపు, ధరల నియంత్రణ, గృహ నిర్మాణ లక్ష్యాలు తదితరాలపై కలెక్టర్ సృజన ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా మార్గనిర్దేశనం చేశారు.

ఈ సమావేశంలో పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, సీపీవో వై.శ్రీలత, డ్వామా పీడీ జె.సునీత, డీపీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎస్‌వో జి.మోహన్‌బాబు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, పరిశ్రమల అధికారి ఎ.సుధాకర్, హౌసింగ్ పీడీ రజనీ కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి సాకా నాగమణెమ్మ, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీ ఎంబీపీ పీడీ పి.ఎం.సుభానీ, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డించాలన్నారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఆకలితో ఉండరాదని, పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరగాలని, వారి హాజరు పెరగాలని బాలురు బాలికల మధ్య లింగ బేధం తగ్గించాలని, సామాజికంగా సమానత్వం పాటించాలని, పోషకాహార లోపాన్ని తగ్గించాలనే ప్రధాన ఉద్దేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. జిల్లాలో తాను కొన్నిచోట్ల పాఠశాలలను తనిఖీ చేసి అక్కడ మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా భుజించానని అంతా బాగుందన్నారు. ఎక్కడైనా నిజంగా భోజనం సరిగా లేకపోతే, సరిగా వండకపోతే నిబంధనల ప్రకారం త్రిసభ్య విద్యా కమిటీ విచారణ జరిపి వంట ఏజెన్సీని మార్చడం జరుగుతుందన్నారు. అయితే పెడన పెనమలూరు ప్రాంతాల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం సరిగా తీసుకోవడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమే తాను పెడనలో పాఠశాలను తనిఖీ చేసి విచారించానని అది వాస్తవం అని గుర్తించి వంట ఏజెన్సీలకు నోటీసులు జారీ చేశామని డిఈ ఓ తహేరా సుల్తానా జిల్లా కలెక్టర్ కు వివరించారు. కమిటీ సభ్యులు మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం లావుగా ఉండడంతో విద్యార్థులు ఇష్టపడటం లేదని, సరిగా తినడం లేదని చెప్పారు. బిపిటి వంటి సన్న బియ్యం పై వారు ఆసక్తి చూపుతున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం ఫోర్టిఫైడ్ కెర్నెల్ కలిగిన పోష్టికాహార బియ్యమని, ఆ బియ్యంలో సూక్ష్మ పోషకాలు, విటమిన్ బి 12 ఉన్నాయని, ఆ బియ్యం తినటం వలన ఆరోగ్యానికి చాలా మంచిదని అన్నారు. బాలికల్లో రక్తహీనత శాతం కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ విషయం పైన విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు సరైన అవగాహన లేదన్నారు. దీనిపై విస్తృతంగా అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా విద్యాశాఖ తగిన చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై తనతో పాటు, ఒక డాక్టర్ చేత మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా భుజించాలని, అందులో వాడుతున్న బియ్యం లో సూక్ష్మ పోషకాలు ఉన్నాయని తెలియజేసే వీడియో తయారు చేయించి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో వినియోగించి విద్యార్థులందరినీ చైతన్య పరచాలన్నారు. విద్యార్థులకు చిక్కీలు, కోడిగుడ్లు నిర్ణిత ప్రమాణాల్లో అందజేస్తున్నారా లేదా వంట ఏజెన్సీలకు సకాలంలో చెల్లింపులు జరుగుతున్నాయా లేదా అని కలెక్టర్ విచారించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ,డి ఈ ఓ తహెరా సుల్తానా, జడ్పీసీఈఓ ఆనంద్ కుమార్, డీఎస్ఓ పార్వతి, పౌరసరఫరాల సంస్థ డిఎం సతీష్,సర్వ శిక్ష ఏపిసి శ్రీరాములు నాయక్, బీసీ సంక్షేమ అధికారి రమేష్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక దాడి అమానవీయం, అమానుషం



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** అభంశుభం తెలియని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడటం అమానవీయం, అమానుషమని సభ్యసమా జం తలదించుకునే సంఘటనకు పాల్పడిన దోషిని ఖఠినాతి కఠినంగా శిక్షిస్తామని చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఇటువం టి దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ మండలం పల్లెర్లమూడి గ్రామంలో హత్యాచారానికి గురైె విజయవాడ పాత పాతప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను, కుటుంబ సభ్యులను మం గళవారం మంత్రి కె. పార్థ సారథి పరామర్శించి చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ మానవత్వాన్ని మరచి తాగుబోతు అత్యంత అమానుషమైన చర్యలకు పాల్పడటం దురదృష్టకర సంఘటన అన్నారు. ఇటువంటి ఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘటన గురించి తెలిసిన వెంటనే ఘటనకు పాల్పడిన దోషిని గుర్తించాలని జిల్లా యంత్రాంగాన్ని, పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,హోమ్ మంత్రి వంగలపూడి అనిత తక్షణమే స్పందించి దోషులను గుర్తించాలని పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేశారన్నారు. పోలీస్ అధికారులు రంగంలోకి దిగి సంఘటన జరిగిన తీరును ఆధారంగా అనుమానితున్ని గుర్తించి రెంటచింతల సమీపంలో అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. నింది తుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనకు పాల్పడాలన్న ఆలోచన రావడానికే భయపడే విధంగా ఖఠి నాతి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటా మ న్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి అవసరమైన తక్షణ సహాయం అందించడం జరిగిందని ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలియజేశారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పార్థ సారథి వివరించారు. అనంతరం పాత ప్రభుత్వాసుపత్రిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి రోగులకు, వెంట వచ్చే సహాయకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించి నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహించి ప్రభుత్వాసుపత్రులపై ప్రజ లకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను, అధికారులను మంత్రి ఆదేశించారు. ఆసుపత్రి పర్యటనలో మంత్రి వెంట పాతప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. వినయ్, ఆర్ఎంవో డా. శోభ, డా. హిమబిందు, వైద్యులు పాల్గొన్నారు.

### డ్రైవ్.భారత్ బహుళ పరిశ్రమల-మొదటి ఈవీ వ్యవస్థా చొరవలను విడుదల చేసిన

# జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా




**ఎంజీ నుండి ఇహబ్ - ఓఈఎం ద్వారా పరిశ్రమలో మొదటి ఈవీ ఛార్జింగ్ ప్లాట్ ఫాం**

**ప్రాజెక్ట్ పునరుద్ధరణ - కార్లను మించి వినియోగించడానికి ఈవీ బ్యాటరీల పునఃలక్ష్యం**

**ఈవీ పీఇడీఐఎ - ఎలక్ట్రిక్ కార్ల కోసం భారతదేశపు మొదటి ప్రత్యేకమైన ఈవీ అవగాహన, విజ్ఞాన ప్లాట్ ఫాం**

**ఎంజీ -జియో ఇన్నోవేటివ్ కనక్టివిటీ ప్లాట్ ఫాం (ఎంజీ-జియో ఐసిపి) - ఇంటరాక్టివ్ గేమింగ్, నేర్చుకోవడం, వినోదపు సాంకేతికత సమూహం**

విజయవాడ, మేజర్ న్యూస్ : జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా డ్రైవ్.భారత్ (DriEV.Bharat)లో మార్గదర్శకత ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) ఆవిష్కరణల సీరీస్‌ను విడుదల చేసింది. వివిధ ఆటోమోటివ్, ఈవీ వ్యవస్థల డొమైన్స్ నుండి ప్రముఖ పరిశ్రమ భాగస్వాముల భాగస్వామ్యంలో న్యూఢిల్లీలో, భారత్ మండపంలో కంపెనీ ఈ కార్యక్రమం నిర్వహించింది. ఈ విలక్షణమైన కార్యక్రమం ఈవీ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి, ఇబ్బంది లేని యజమాని అనుభవం కోసం దృఢమైన ఈవీ మౌళిక సదుపాయం రూపొందించడంత పాటు ఎలక్ట్రిక్ వాహనాలను వేగంగా ఉపయోగించడానికి తయారీదారుల స్థిరమైన నిబద్ధతను ప్రదర్శిస్తోంది. ఎంజీ ద్వారా విడుదల చేయబడిన ఈహబ్ కార్యక్రమంలో, పరిశ్రమలో మొదటి మరియు అతి పెద్ద ఛార్జింగ్ ప్లాట్ ఫాం ఓఈఎం ప్రారంభించబడింది. ప్రాజెక్ట్ రివైవ్, ఈవీ పీఇడీఐఎ యొక్క కార్లను మించిన ఈవీ బ్యాటరీస్ పునః లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించింది. ఇది ఎలక్ట్రిక్ కార్ల యూజర్స్ కోసం భారతదేశపు మొదటి ప్రత్యేకమైన అవగాహన, విజ్ఞాన వేదికబీ ఎంజీ-జియో ఇన్నోవేటివ్ కనక్టివిటి ప్లాట్ ఫాం (ఎంజీ-జియో ఐసీపి) రాబోయే ఎంజీ వాహనాలలో స్టాండర్డ్‌గా నిలుస్తుంది. వినూత్నత, సుస్థిరతలకు కంపెనీ వారి నిబద్ధతను సూచిస్తూ, పరిశ్రమ మొదటి ఛార్జింగ్ ప్లాట్ ఫాం, ఎంజీ యొక్క ఈహబ్ కార్యక్రమంలో పరిచయం చేయబడింది. సింగిల్ ప్లాట్ ఫాంతో అందచేయడం ద్వారా దేశ వ్యాప్తంగా కస్టమర్ల కోసం ఈవీ ఛార్జింగ్ అనుభవం సరళం చేయడానికి ఇది ఉద్దేశ్యించబడింది. స్థిరమైన కమ్యూనిటీ వాడకాల కోసం పునరుత్పాదక శక్తిని నిల్వ చేసే వ్యవస్థలుగా రెండవ జీవిత కాలం కేటాయించడానికి కార్లను మించిన పునః లక్ష్యం గల ఈవీ బ్యాటరీలను కేటాయించాలనే లక్ష్యంతో కంపెనీ టీఈఆర్ఐ, లోహమ్, బ్యాట్ఎక్స్ భాగస్వామ్యంతో ప్రాజెక్ట్ రివైవ్ ను కూడా పరిచయం చేసింది. ఈ చొరవ వ్యర్థాలను నిర్మూలించి, పునః వాడకం, మరమ్మతు, రీసైక్లింగ్ యొక్క సూత్రాల ద్వారా వనరుల నిరంతర వాడకం లక్ష్యంగా సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. వినియోగదారు చైతన్యం, మెరుగుపరచడానికి తమ నిబద్ధతను శక్తివంతం చేస్తూ, వారి సందేహాలు తీరుస్తూ, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా పరిశ్రమలో మొదటి ప్రత్యేకమైన ఈవి అవగాహనా ప్లాట్ ఫాం ఇవిపిఇడిఐఎ ను విడుదల చేసింది. ఈ చొరవ ఈవీ టెక్నాలజీ, ప్రయోజనాలు, వ్యయాలు, నిర్వహణపై నమ్మకమైన, ఖచ్చితమైన, నిమగ్నమైన సమాచారాన్ని అందిస్తుంది.

అపోహలు పోగొట్టి, అవగాహనతో కూడిన నిర్ణయాలను ప్రోత్సహించడం ద్వారా, ఈవీ పీఇడీ ఐఎ ఈవీ గురించి తెలియచేస్తూ, ఈవీని ఎక్కువమంది ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తోంది. రాబోయే ఎంజీ కార్లు ఎంజీ-జియో ఇన్నోవేటివ్ కనక్టివిటీ ప్లాట్ ఫాం (ఎంజీ-జియో ఐసీపీ) ఫీచర్ ను కలిగి ఉంటాయని కారు తయారీదారు ప్రకటించింది. ఇన్-కార్ గేమింగ్ కోసం ఎంజీ యాప్ స్టోర్, వినోదం, నేర్చుకోవడం, ఆరు భారతీయ భాషల్లో గొప్ప వాయిస్ సామర్థ్యం, కొత్త హోమ్%-%టు-కారు ఫంక్షన్ సహా ఎన్నో మొదటి అంశాలను పరిచయం చేయబడిన టెక్నాలజీ ప్రయోజనం ఇది. కార్యక్రమంలో, ఈవీల దీర్ఘకాలిక ప్రయోజనాల గురించి ఈవై, ఐఐటీ వంటి పరిశ్రమ నిపుణులలో ప్యానల్ చర్చలు జరిగాయి. జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియాలో గౌరవ్ గుప్తా, ఛీఫ్ గ్రోత్ ఆఫీసర్, భారతదేశంలో ఎలక్ట్రిక్ సంచారం యొక్క భవిష్యత్తును పునః నిర్వచించడానికి కంపెనీ వారి కలను తెలియచేస్తూ ఇలా అన్నారు, డ్రైవ్.భారత్ ఈవీ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి మా నిరంతర నిబద్ధతను చూపిస్తుంది, ఈవీని వినియోగించడాన్ని పెంచడానికి యూజర్ అనుభవాన్ని మెరుగుపరుస్తుంది. మా ఏకీకృత ఛార్జింగ్ ప్లాట్ ఫాం, బ్యాటరీ యొక్క రెండవ జీవిత కాలం ప్రాజెక్ట్, ఈవీ అవగాహన,, ఎంజీ-జియో ఐసీపీ వంటి చొరవలతో, మేము పరిశ్రమను, మా కస్టమర్లను కూడా తెలివైన, మరింత సుస్థిరమైన ఎంపికలుగా పరిశ్రమకు సాధికారత కలిగిస్తున్నాం." భారతదేశపు ఎలక్ట్రిక్ వాహనం దృశ్యంలో మార్గదర్శకుడు, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటారు విజయవంతంగా దేశపు మొదటి ఇంటర్నెట్ ఎలక్ట్రిక్ ఎస్ యువి, ఎంజీ జడ్ఎస్ ఈవీని, కొత్త పట్టణ సంచార పరిష్కారం, ఎంజీ కామెట్ ఈవీని విడుదల చేసింది. సమగ్రమైన ఈవీ వ్యవస్థను ప్రోత్సహించడానికి నిబద్ధతతో, బ్రాండ్ 6-విధాలుగా ఛార్జింగ్ పరిష్కారాలను అందించింది, దేశవ్యాప్తంగా 1,000 కమ్యూనిటీ ఛార్జర్లను నెలకొల్పే లక్ష్యాన్ని కలిగి ఉంది. కీలకమైన పరిశ్రమ భాగస్వామ్యులు, ఎంజీడిపి, ఎంజీ నర్చర్ వంటి చొరవలతో, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ 1,500 స్టార్టప్స్ తో నిమగ్నమైంది, ఈవీ గురించి అవగాహన కలిగించి, నైపుణ్యం అభివృద్ధి చేయడానికి 50కి పైగా కాలేజీలతో సహకరిస్తోంది. ఎంజీ నుండి ఈహబ్ ఎంజీ వారి ఈహబ్ ఈవీ ఛార్జింగ్ కోసం సమగ్రమైన పరిష్కారం. గుర్తించడం, రిజర్వ్ చేయడం, ఛార్జింగ్ స్టేషన్లకు చెల్లించడం వంటి ప్రక్రియలను సరళం చేసింది. ప్రముఖ ప్రొవైడర్లు అదాని టోటల్ ఎనర్జీస్ లిమిటెడ్ (ఏటిఈఎల్), బిపిసిల్, ఛార్జ్ జోన్, గ్లిడా, హెచ్ పిసిఎల్, జియో-బిపి, షెల్, స్టాటిక్, జియాన్,, త్వరలోనే వ్యవస్థలో చేరబోయే ఇంకా ఎంతోమందితో భాగస్వామ్యాల ద్వారా దేశంలో పూర్తి ఛార్జింగ్ నెట్ వర్క్ కు యాక్సెస్ తో ఈహబ్ నిరంతరమైన ఛార్జింగ్ అనుభవం అందిస్తోంది. 11 భాషల్లో లభిస్తుంది, ట్రిప్-ప్రణాళికా ఫీచర్లు కలిగిన ఈ యాప్ ఇబ్బందిలేని ఈవీ ఛార్జింగ్ అనుభవం అందిస్తుంది.







## రెండో ఏడాది కూడ బెస్ట్ హెల్త్‌కేర్ బ్రాండ్‌గా అమృతాంజన్




**విజయవాడ, జూలై 6, మేజర్ న్యూస్ :** భారత హెల్త్‌కేర్ పరిశ్ర మలో 131 ఏళ్ల చరిత్ర గల లక్ష్య-ఆధారిత, వినూత్న సంస్థ అమృతాంజన్ హెల్త్‌కేర్‌కి ఈటి నౌ బెస్ట్ హెల్త్‌కేర్ బ్రాండ్స్ 7వ విడత కార్యక్రమంలో ప్రతిష్టాత్మకమైన ఉత్తమ హెల్త్‌కేర్ బ్రాండ్ అవార్డు లభించింది. దేశవ్యాప్తంగా 1,000 పైచిలుకు ఇతర హెల్త్‌కేర్ బ్రాండ్లను కఠినతరమైన ప్రమాణాలతో మదింపు చేసి, ఎంపిక చేసిన ప్రక్రియలో సంస్థకు ఈ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా అమృతాంజన్ హెల్త్‌కేర్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. శంభు ప్రసాద్ మాట్లాడుతూ ఈటి బెస్ట్ హెల్త్‌కేర్ బ్రాండ్స్ పురస్కారాన్ని దక్కించుకోవడం మాకు గర్వకా రణం. వినియోగదారుల జీవితాలను మెరుగుపర్చే ఉత్తమ హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌ను అందించడంలో అ త్యుత్తమంగా నిల్చేం దుకు మేము చేసే నిరంతర కృషి, మా నిబద్ధతకు ఈ పురస్కారమే నిదర్శనం. అంకిత భావంతో పని చేసే మా టీమ్‌కు, మా వెన్నంటే ఉండే కస్టమర్లకు, మా విజయంలో కీలక పాత్ర పోషి స్తూ మద్దతుగా నిలుస్తున్న భాగస్వా ములకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇకపై కూడా ఇంటింటా ఒక విశ్వసనీయమైన బ్రాండుగా పేరు నిలబెట్టుకునేలా హెల్త్‌కేర్‌లో అత్యుత్తమ ప్రమాణాలను పాటిం చడాన్ని, నవకల్పనలను ఆవిష్కరించడాన్ని కొనసాగిస్తాం" అని అన్నారు, అందుబాటులోను ఉంటుంది.

మా యూజర్లకు కేవలం ఉపశమనం కలిగించడమే గాకుండా వారి పూర్తి ఆరోగ్యాన్ని కూడా మెరుగుపర్చే ఉత్పత్తులను రూపొందించేందుకు మేము నిరంతరం కృషి చేస్తున్నాం. వినియోగదారులతో బంధాన్ని మరింత పెంపొందింపచేసుకుంటూ వ్యక్తిగతీకరించిన హెల్త్‌కేర్ సొల్యూషన్స్ అందించ డంపై మరింతగా దృష్టి పెడుతున్నాం" అని అమృ తాంజన్ హెల్త్‌కేర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మణి భగవతీశ్వరన్ తెలిపారు.

## 54% శాతం తల్లిదండ్రులకు పిల్లల ప్రశ్నలకు తక్షణ సమాధానాలు లేవు

**విజయవాడ, ఆగస్టు6, మేజర్ న్యూస్ :** పిల్లలు సహజంగానే ఆసక్తిని కలిగి ఉంటారు. తల్లిదండ్రులు వారి ఉత్సుకతను తీర్చే ఖచ్చితమైన సమాధానాలను కనుగొనడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తారు. జూన్ 2024లో ఆరు నగరాల్లోని 750ం తల్లి దండ్రుల మధ్య అమెజాన్ అలెక్సాచే నియమించబడిన కాంతర్ నిర్వహించిన ఇటీవలి అధ్యయనంలో ఇది స్పష్టంగా కనిపించింది. సర్వేలో పాల్గొన్న తల్లిదండ్రులలో దాదాపు 54% మంది పిల్లల ప్రశ్నలకు తక్షణ సమాధానాలు లేవని తరచుగా భావిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. 52% మంది ప్రతివాదులు తక్షణమే శోధించి, వారికి సమాధానం తెలియకపోతే ఖచ్చితంగా సమాధానం ఇస్తారని ఇది సూచిస్తుంది. గమనించదగ్గ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సర్వేలో పాల్గొన్న 44% తల్లిదండ్రులు అక్కడికక్కడే సమాధానా లను రూపొందించి నట్లు అంగీకరించారు. సర్వేలో పాల్గొన్న 3% మంది తల్లి దండ్రులు మాత్రమే ప్రశ్నను విస్మరిస్తారు లేదా పిల్లవాడిని ప్రశ్నలు అడగకుం డా ఆపడానికి టాపిక్ మార్చారు "కారును ఎలా తయారు చేయాలి?", "విశ్వం ఎంత పెద్దది?", "విమా నం ఎలా ఎగురుతుంది?", "చేపలు నీటి కింద ఎలా ఊపిరి పీల్చుకుంటాయి?" మొదలైనవి పిల్లలు అడిగే ఆసక్తికరమైన ప్రశ్నలు. "శీతాకాలం, వేసవి మధ్యలో ఏ సీజన్ వస్తుంది?", "తల్లిదండ్రులు ఎందుకు పని చేయాలి?", "మేము కూరగాయలు ఎందుకు కడగాలి?" వంటి తేలికగా అనిపించే ప్రశ్నలను పిల్లలు అడిగినప్పుడు 60% మంది తల్లిదండ్రులు తమను తాము తరచుగా స్టంప్ చేస్తారని సూచించారు. ?", ఇతరులలో కొంతమంది తల్లిదండ్రులు తమ భాగస్వామికి సమాధానాలు ఇవ్వడానికి కూడా మొగ్గు చూ పుతారు, సర్వే పూల్‌లో 37% మంది తమ పిల్లలను తమ ప్రశ్నలతో ఇతర తల్లిదండ్రుల వద్దకు వెళ్లమని అడిగారని అంగీకరించారు. పిల్లలు టీవీ చూస్తు న్నప్పుడు ఎక్కువ ప్రశ్నలు అడుగుతారు ఈ అధ్యయనం పిల్లల ఉత్సుకత ట్రిగ్గర్ లపై మరింత విశదీకరించింది. ఇందులో 63% మంది తల్లిదండ్రులు తమ పిల్లలు టీవీ చూస్తున్నప్పుడు మరింత ఆసక్తిగా ఉంటారని, ప్రశ్నలు అడుగుతారని వెల్లడించారు. ప్రయాణం (57%), చదువుకోవడం (56%), అవుట్‌డోర్ యాక్టివిటీస్ (55%), హ్యాండ్‌హెల్డ్ పరికరాలలో కంటెంట్ చూడటం (52%),, పెద్దల మధ్య సంభాషణలు వినడం (50%) పిల్లల్లో ఉత్సుకతను రేకెత్తించే ఇతర ఐదు కార్యకలాపాలు. అంతేకాకుండా, ఆహారం, జంతువులు, ప్రకృతి, సాధారణ జ్ఞానం, సెలవులు, సాంకేతికత, చలనచిత్రాలు పిల్లలు విచా రించే కొన్ని ప్రధాన అంశాలుగా ఉద్భవించాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమాచారాన్ని యాక్సెస్ చేసే, బదిలీ చేసే విధానాన్ని మార్చడంలో సాంకేతికత సహాయపడింది 80% కంటే ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లల ప్రశ్నలకు సమాధానమివ్వడంలో సహాయపడే సమాచారాన్ని కనుగొనడానికి తరచుగా సాంకేతికతను ఉపయోగిస్తున్నారని సర్వే పేర్కొంది. అలెక్సా (ఎకో స్మార్ట్ స్పీకర్‌ల వంటి పరికరాలలో అందుబాటులో ఉంది)తో సహా వాయిస్ ఎఐ సేవల వంటి సాంకేతికతలు తల్లిదండ్రులకు తమ పిల్లల ప్రశ్నలకు సమాచారం లేదా సమాధానాలను కనుగొనడంలో సహాయపడతాయి, తద్వారా వారి పిల్లల ఉత్సుకతను స్వేచ్ఛగా సంతృప్తిపరచడంలో సహాయపడతాయి. సిద్ధంగా ఉన్న ప్రతిస్పందనలతో. కాబట్టి, పిల్లలు ఆసక్తిగా భావించినప్పుడు, తల్లిదండ్రులు సైన్స్ నుండి చరిత్ర, అంతకు మించి అనేక రకాల అంశాలలో ఏవైనా ప్రశ్నలు అడగడం ద్వారా అలెక్సా సహాయం తీసుకోవచ్చు.




## సిప్లా ఆధ్వర్యంలో బ్రీత్‌ఫ్రీ మాన్‌సూన్ యాత్ర

**విజయవాడ మేజర్ న్యూస్ :** శ్వాసకోశ ఆరోగ్యానికి వర్షాకాలం ముఖ్యమైన సవాళ్లను కలిగిస్తుంది. పెరిగిన ఆర్ద్రత, తేమ ఊపిరితిత్తుల పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తాయి. ఈ సమయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చాలా కీలకం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రోయాక్టివ్ పేషెంట్ కేర్‌కు నిరంతర నిబద్ధతకు అనుగుణంగా, సిప్లా యొక్క సమగ్ర పేషెంట్ సపోర్ట్ ఇనిషియేటివ్ బ్రీత్‌ఫ్రీ మాన్‌సూన్ యాత్రను ప్రారంభించింది. వ్యక్తులు వారి శ్వాసకోశ ఆరోగ్య స్థితిని అర్థం చేసుకోవడంలో సహాయపడే లక్ష్యంతో, ఆస్తమా, సిఓపిడి (క్రోనిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) వంటి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్‌లకు యాత్ర అధిక ప్రాప్తిని అందిస్తుంది. మూడు నెలల వ్యవధిలో, దేశవ్యాప్తంగా 4,000 కంటే ఎక్కువ శిబిరాలు నిర్వహించబడతాయని, 3.50 లక్షల మంది పరీక్షించబడతారు. బ్రీత్‌ఫ్రీ మాన్‌సూన్ యాత్ర దేశవ్యాప్తంగా వ్యక్తులు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి అవసరమైన సమాచారం, వనరులకు ప్రాప్యతను కలిగి ఉండేలా నిర్ధారిస్తుందని కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్, స్లీప్మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ కార్తీక్ తిప్పారపు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సమస్యల వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే సౌమ్య



**నందిగామ, ఆగస్టు 6, మేజర్ న్యూస్:** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల సమస్యలు విని వాటిని పరిష్కరించడం కోసం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వినతులు స్వీకరించారు. వారి సమస్యలు విని వినతుల పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపించే విధంగా చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ జవాబుదారీగా వ్యవహరిస్తుందని అన్ని వినతలను పరిష్కరిస్తామన్నారు.

## గోశాల నిర్మాణం కొరకు కమిటీ ఏర్పాటు




**పెడన, మేజర్ న్యూస్ :** పట్టణంలో గోశాల నిర్మాణం కొరకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని ఈ కమిటీ ఏర్పాటుకు హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీ గంగా పార్వతి సమేత అవస్థేశ్వరస్వామి ఆలయంలో పెద ముతేవి శ్రీకృష్ణాశ్రమము మక్షూజన శ్రీ గౌరీ కృష్ణ గురుదేవులు సమక్షాన జరిగిందని హిందూ బంధువుల ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురుదేవులు మాట్లాడుతూ ఒక గోశాల కడితే 33 కోట్ల దేవతలకు గుడి కట్టినట్లే అని దేశములో ఎక్కడా లేని విధముగా ఒక ఊరిలో అన్ని దేవాలయాలు కలసి ఒక కార్యక్రమం చేయడం హిందువుల ఐక్యతను బలపరుస్తున్నాదని గురుదేవులవారు వారి అనుగ్రహభాషణంలో సెలవిచ్చారు. అనంతరం మధురగాన సుధానిధి శ్రీ పోపురిగౌరినాథ్ బృందంవారు పాడిన సంగీత భక్తి పాటలు ఆహ్వానితులను అలరించాయి. భక్తులు, గో ప్రేమికుల సహాయ సహకారాలతో త్వరలో గోశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పెడన హిందూబంధువుల ఐక్యవేదిక వారు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి 62 దేవాలయాల కమిటీ సభ్యులు, అర్చకులు, ఆర్ఎస్ఎస్, విశ్వహిందుపరిషత్, బజరంగ్దాల్, శివశక్తి, హిందూబంధువులు పాల్గొన్నారు.



# గత ప్రభుత్వ మాజీ సలహాదారు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యలు సరికావు




**ఏపీఎన్జీజివో రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.పురుషోత్తం నాయుడు**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు అంశాలపై గత ప్రభుత్వ సలహాదారు ఉద్యోగుల సంక్షేమం ఎన్. చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యలు అభ్యంతరకరమని, సత్యదూరమని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు కే.వీ. శివారెడ్డి ప్రధాన కార్యదర్శి సిహెచ్ పురుషోత్తమ నాయుడు తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమియో జరిగిన ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ నిజానికి గత ప్రభుత్వ హయం ఐదు సంవత్సరములు ఉద్యోగులకు చీకటి రోజులని, ఉద్యోగులకున్న సర్వహక్కులను ప్రయోజనాలను గత ప్రభుత్వం హరించి వేసిందని, ఉద్యమాలకు ఉపక్రమించిన ఉద్యోగ సంఘాల నాయకులు పై ఉద్యోగులపై ఉపాధ్యాయులపై 4000 కేసులు పెట్టిన ప్రభుత్వం ఇంకోటి లేదని, గత ఐదు సంవత్సరాలుగా వీటి మీద ఎవ్వరూ కూడా ఒక్క మాట మాట్లాడలేదని, ఈ కేసులన్నిటినీ పరిశీలించి ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ప్రకటించడం హర్షనీయమని అన్నారు. దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వంలో లేని విధంగా 11వ పి ఆర్ సి ని రివర్స్ పిఆర్సిగా చేసిన ఘనత గత ప్రభుత్వాన్ని దేనిని, పిఆర్సి కమిషన్ రిపోర్ట్ గడువు ను నాలుగు సంవత్సరాలకు పొడిగించి, కనీసం పీఆర్సీ రిపోర్టును కూడా ఉద్యోగ సంఘాలకు ఇవ్వకుండా, ఉద్యోగులు ఆప్షన్ ఇవ్వకుండా, జీత భత్యాలను తగ్గించి ఇచ్చిన ప్రభుత్వం గత ప్రభుత్వమేనని తెలిపారు. ఉద్యోగుల జిపిఎఫ్ అకౌంట్‌లో నుంచి గత ప్రభుత్వం డబ్బులు డ్రా చేస్తే కనీసం నోరు మెదపనివారు, ఇప్పుడు నెల తిరగకుండానే సుద్దులు చేపటం సరికాదన్నారు. జిపిఎఫ్, ఏపీజిఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను సంవత్సరాల తరబడి బాకీ పెట్టిన గత ప్రభుత్వం, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా 21900 కోట్ల రూపాయల్ని బకాయిలు పెట్టారని, పూర్తి వివరాలు అందితే అవి ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధ్యాయులపై ప్రవీణ్ ప్రకాష్ వైఖరి, 117 ఉత్తర్వులు ద్వారా విద్యా వ్యవస్థను నాశనం చేసి, సీపీఎస్ రద్దు హామీని మరచిపోయి, జీపీఎస్ ను బలవంతంగా రుద్ది, ఉపాధ్యాయులపై ఉక్కు పాదం మోపిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కనీసం ఉపాధ్యాయులను బాత్రూంలో వద్ద, మద్యం దుకాణాల వద్ద డ్యూటీ వేసినప్పుడైనా ఎన్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడి ఉంటే బాగుండేదని, ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు వచ్చేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఎడిషనల్ క్వాంటం పెన్షన్ చంద్రబాబు నాయుడు 2018 లో 10 శాతానికి మంజూరు చేయగా, గత ప్రభుత్వం దానిని ఏడు శాతానికి కుదించిందని, పునరుద్ధరించాలని ఉద్యమం చేస్తున్న పెన్షనర్లకు 10 శాతం చేస్తామని మభ్యపెట్టి ఉద్యమాన్ని విరమింపజేసిన గత ప్రభుత్వ పెద్దలు, సలహాదారులు వారికి మొండి చేయి చూపటం నిజం కాదా అని ప్రశ్నించారు. అసలు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల వ్యవస్థను, వారి స్థితిగతులను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ కి వెంటిలేటర్ మీద చేర్చిన ఘనత గత ప్రభుత్వానిదేనని, కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కాకముందే ఇవన్నీ పరిష్కారం కావు, ఉద్యోగులకు మొండి చేయి అని ప్రకటించడం సమంజసం కాదని తెలిపారు. ప్రభుత్వ జీతం మీద ఉద్యోగుల సంక్షేమ సలహాదారుగా కనీసం ఏ ఒక్క విషయంలోనైనా మంచి సలహా ఇచ్చి ఆచరింప చేసి ఉంటే ఉద్యోగులకు మంచి జరిగేది కదా అని ప్రశ్నించారు.

ఏపీ ఎన్జీ జీవో సంఘ మాజీ నాయకులు అనేకమంది వివిధ పార్టీలో ఉన్నారని, వారు పార్టీ ప్రయోజనాలు అనుగుణంగా మాట్లాడుతుంటారని, వారికి ఏపీ ఎన్జీవో సంఘంతో ఎటువంటి ప్రమేయం లేదని, ఏపీ ఎన్జీ జీఓ సంఘం ఉద్యోగుల ప్రయోజనాలపై దృష్టిలో పెట్టుకుని నిరంతరం పని చేస్తుందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒకటో తారీఖున జీతాలు పెన్షన్లు చెల్లించటం, జిపిఎస్ గెజిట్ పై ప్రకటన, ఉద్యోగులపై ఉన్న నాలుగు వేల కేసులు ఎత్తివేస్తానని ప్రకటించడం, అధికారులతో ఉద్యోగులతో గౌరవంగా మేలగాలని మంత్రులకు కలెక్టర్లకే ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడం వంటి చర్యలు ఈ ప్రభుత్వంపై ఉద్యోగులలో నమ్మకాన్ని పెంచాలని, ఏపీ ఎన్జీజీవో సంఘం కూడా కూటమి ప్రభుత్వానికి నిర్మాణాత్మక సహకారాన్ని అందించి ఉద్యోగుల డిమాండ్లు అన్నిటినీ పరిష్కరించడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఐఆర్ ప్రకటించటం, వేతన సవరణ కమిటీని నియమించడం, 62 సం. పదవీవిరమణ అందరికి వర్తింపచేయడం వంటి అంశాలను చీఫ్ సెక్రటరీ దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తమని తెలిపారు. ఒకటో తారీఖున సామాజిక పెన్షన్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందించిన అధికారులు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియజేశారు.

## బ్యాంకర్ల సమితి సమీక్ష సమావేశం




**నందిగామ, ఆగస్టు 6, మేజర్ న్యూస్:** పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారిని ఉమాదేవి, డి ఆర్ డి ఏ పిడిఎల్ డిఎం నాబార్డ్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమాదేవి మాట్లాడుతూ బ్యాంకర్లు ప్రజలు,ఖాతాదారులతో స్నేహభావంగా మెలుగుతూ ప్రభుత్వం ప్రజలకు అంద చేస్తున్న పథకాలకు సంబంధించిన లోన్లు అర్హులైన వారికి అందజేయాలని తెలిపారు, ప్రజల నుండి డిపాజిట్లు సేకరణ, రైతులకు సీజన్లో పంట రుణాలు, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం, ఇతర పథకాలకు సంబంధించిన లోన్లు అర్హులైన వారికి అందజేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వనాధ్, అధికారుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని విజయవంతం చెయ్యండి

**అఖిల భారత శ్రీకృష్ణదేవరాయల సంఘం నేషనల్ కన్వీనర్ సంకాబత్తుల వెంకట్**



**గన్నవరం, ఆగస్టు 6, మేజర్ న్యూస్ :** గుంటూరులో ఈ నెల 7 న జరగబోయే శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని విజయవంతం చెయ్యాలని అఖిల భారత శ్రీ కృష్ణ దేవరాయల సంఘం నేషనల్ కన్వీనర్ సంకాబత్తుల వెంకట్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కృష్ణా జిల్లా గన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ కార్యాలయం లో నేషనల్ కన్వీనర్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాపు జే.ఎ.సి చైర్మన్,పెద్దలు అమ్మ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగబోయే శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని కాపు, తెలగ, బలిజ, తూర్పు కాపు, మున్నూరు కాపు, ఇతర ఉప కులాలు వేలాదిమంది తరలి వచ్చి విజయవంతం చెయ్యాలని వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం లో గెలుపొందిన కాపు ప్రజాప్రతినిధులైన శాసనసభ్యులకు, పార్లమెంట్ సభ్యులకు ఘనంగా సత్కరించడం జరుగుతుందని, భవిష్యత్తు అంతా కాపులదే అని, జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ముందుకి వెళదామని ఆయన అన్నారు. కాపులకు రాజ్యాధికారం కొరకు అఖిల భారత శ్రీకృష్ణ దేవరాయల సంఘం నిరంతరం కృషి చేస్తుందని వెంకట్ పేర్కొన్నారు.ప్రతి కాపు బిడ్డ కష్టపడి చదువుకోవాలని అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చుని ఎంత కష్టం వచ్చిన పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని వెంకట్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రావడానికి జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఆయన నాయకత్వం పై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ లో ఉన్న 90 శాతం కాపులు పెద్దన్న పాత్ర పోషించి కూటమి విజయానికి ప్రముఖ పాత్ర పోషించామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా కాపులను అకారణంగా ఎవరైనా ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నం చేస్తే స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి మాన్య కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, మానవ వనరుల ఐ.టి శాఖ మాత్యులు నారా లోకేష్ బాబు ల దృష్టికి తీసుకోని వెళతామని వెంకట్ తెలిపారు. కాపులు ఒకరికి కాపు కాసే శక్తి తప్ప ఏ ఒక్కరికీ హాని చెయ్యరని, కాపు జాతి విద్యా, వాణిజ్య, వ్యాపార పారిశ్రామిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెంది ఆర్థిక శక్తిగా ఎదగాలని వెంకట్ ఆశా వ్యక్తం చేసారు. భారతదేశంలో కాపు, తెలగ, బలిజ, తూర్పు కాపు, మున్నూరు కాపు, ఇతర ఉప కులాలు ఐక్యత కి, సంక్షేమానికి కృషి చేస్తామని అఖిల భారతదేశ శ్రీకృష్ణ దేవరాయల సంఘం నేషనల్ కన్వీనర్ సంకాబత్తుల వెంకట్ అన్నారు.

# ఇసుక రవాణా జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఎక్కడ అక్రమంగా ఇసుక రవాణా జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమంగా రవాణా కాకుండా నిరోధించాలన్నారు. ఇసుక రీచ్ లలో గట్టిగా నిఘా ఉంచి ఇసుక అక్రమంగా రవాణా కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా గుర్తించిన 26 ప్రదేశాల్లో సీసీటీవీ లను అమర్చేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసి అందజేయాలన్నారు. మద్దూరులో సీజ్ చేసిన 1500 టన్నుల ఇసుక బయటకు తరలిపోకుండా ఎస్ ఈ బి అధికారులు అక్కడ సీసీటీవీలను అమర్చి అందుకు సంబంధించిన బిల్లును చెల్లింపు కోసం అందజేయాలన్నారు. అనుమతి లభించిన 8 ఇసుక రీచులలో రానున్న వర్షాకాలంలో చేతులతో (మాన్యువల్‌గా) ఇసుక తీసుకోవడానికి గానీ లేదా కన్వేయర్ బెల్ట్ ద్వారా టిప్పర్లోకి లోడింగ్ చేయడానికి క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. కొత్తగా గుర్తించిన 5 రీచ్ లలో 14 లక్షల టన్నుల వరకు ఇసుక ఉండే అవకాశం ఉందని, అక్కడ సెమీ మెకనైజ్డ్ (కొంతవరకు యంత్రాలతో) ఇసుక తవ్వడానికి గనులు, జలవనరులు, రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్, ఎస్ ఇ బి, భూగర్భజల శాఖల అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేసి ప్రజల అభిప్రాయం తెలుసుకొని పూర్తి సిఫారసులతో వచ్చే సమావేశానికి నివేదిక తీసుకుని రావాలన్నారు. ఈనెల 9వ తేదీన మరల సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఆ తేదీన కోరిన నివేదికలు పూర్తిస్థాయిలో అందజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి కొండారెడ్డి, ఎస్ ఈ బి సూపరింటెండెంట్లు జి గంగాధర్ రావు, పాండురంగారావు, ఇన్స్పెక్టర్లు వెంకటలక్ష్మి, శివరామరాజు, హేమ సుస్మిత, డిపిఓ నాగేశ్వర్ నాయక్, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి శ్రీనివాసరావు, భూగర్భ జల శాఖ అధికారి విజయవర్ధన్ రావు, జల వనరుల శాఖ ఈ కృష్ణారావు, ఎంవిఐ స్వర్ణ శ్రీనివాసు, ఎస్ వి ఎన్విరో ల్యాబ్స్ కన్సల్టెంట్లు సునీల్, కృష్ణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ మానసిక అవగాహన సదస్సు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జాతీయ మానసిక ఆరోగ్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా మానసిక కార్యక్రమం కృష్ణాజిల్లా వారు మచిలీపట్నం శ్రీ పద్మావతి జూనియర్ మహిళ కళాశాల, నిడుమోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ మానసిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా కృష్ణా జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతబాయి పాల్గొని విధ్యార్థినులకు మానసిక ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల అవగాహన కల్పించారు. మన చుట్టు పక్కన ఉన్న వారిలో ఒత్తిడి, భయం, సోషల్ స్టిగ్మా నుండి ఎలా బయటకి రావాలి, సమాజంలో ఆడపిల్లల మీద జరిగే ఆగత్యాల మీద ఎటువంటి ఆందోళనకు గురి కాకుండా మనోధైర్యంతో వాటిని ఎలా చేదించాలి అనే విలువైన విషయాలు, తల్లితండ్రులు, గురువులు పట్ల ఆలోచన సరళి వ్యవహారసైలి ఏవిధంగా ఉండాలి అని చెప్తూ పిల్లల్లో వచ్చే మానసిక సమస్యల పైన అవగాహనా కల్పించారు. జిల్లా అసంక్రామిత వ్యాధులు ప్రోగ్రాం అధికారి హిమబిందు మాట్లాడుతూ ఇతరుల పట్ల రాగద్వేషాలకు వెళ్లకుండా తగిన మంచి పనులు అలవాటు చేసుకోవాలని ప్రతి విషయాన్ని తల్లితండ్రులకు చెప్పాలన్నారు. సరైన లక్ష్యసాధన కలిగి ఉండాలి మనకి మన ఊరికి మంచి పేరు తీసుకుని రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి, జిల్లా వైద్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ మహేష్, మచిలీపట్నం డాక్టర్స్ కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## శ్రావణమాసంలో నాన్‌వెజ్ ముట్టరాదు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** శ్రావణమాసంలో నాన్‌వెజ్ తినకూడదని సైంటిఫిక్ రీజన్ తెలియచేస్తుంది. శ్రావణ మాసంలో దేశ వ్యాప్తంగా ప్రతి ఇంట ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. సనాతన ధర్మాన్ని పాటిస్తూ ఎక్కువ మంది ఈ నెలలో మాంసాహారానికి దూరంగా ఉంటారు. దీనికి పలు సైంటిఫిక్ రీజన్స్ ఉన్నాయి. శ్రావణమాసం వర్షాకాలంలో వస్తుంది. ఈ సమయంలో కోళ్ళు, ఇతర జంతువులకు వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇటు సూర్యరశ్మి తక్కువగా ఉండటంతో శరీరంలో జీర్ణవ్యవస్థ రోగ నిరోధక శక్తి మందగిస్తుంది. ఈ సమయంలో మాంసం తీనడంతో జీర్ణ సమస్యలు కూడా తలెత్తుతాయి.

## హోమ్ గార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్ చెక్కు అందజేత



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** హోమ్ గార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్ చెక్కును మరణించిన హోంగార్డు కుటుంబానికి కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అందజేశారు. కృష్ణాజిల్లా హోంగార్డ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ 14.06.2024 తేదీన రహదారి ప్రమాదంలో హోంగార్డ్ – 220 కె. పోతురాజు మరణించగా ఆయన తోటి సహచర హోంగార్డ్స్ అందరి ఒకరోజు వేతనం రూ.3,86,950లు, అలాగే ఓఎన్‌జిసి డిప్యూటేషన్ హోంగార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్ రూ.14,440 లను చెక్కుల రూపంలో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు పోతురాజు సతీమణి అమలేశ్వరికి అందజేసారు. ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చినా ఏ ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా తెలుపుకోవచ్చని, పోతురాజు మరణించినప్పటికీ మీరంతా పోలీస్ కుటుంబ సభ్యులేనని మీకు అండగా కృష్ణా జిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్ వి డి ప్రసాద్, ఆర్ ఐ హోంగార్డ్స్ రవికుమార్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## దేశ భక్తి, సమైక్యతకు గన్నవరంలో పరుగులు



**గన్నవరం, ఆగస్టు 6, మేజర్ న్యూస్ :** దేశ సమగ్రతను పెంపోందించుట కొరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్వాగతం పలుకుతూ హెచ్. సి.యల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థిని, విద్యార్థులతో ఐక్యత కోసం పరుగుల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయురాలు మోహిని కృష్ణ కుమారి పరుగుల జాతీయ జెండా ఊపి ప్రారంభించగా విద్యార్థులు అందరూ జాతీయ జెండాలను చేత బూని భారత మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. స్పోర్ట్స్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ బొమ్మిశెట్టి సత్యనారాయణ రావు మాట్లాడుతూ క్రీడల కొరకు మార్పు అనే నినాదం తో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా ఉపాధ్యాయురాలు మాలతి, వ్యాయామ ఉపాధ్యాయులు మీరా సాహెబ్, జనంజన రాజు, గోపి తదితరులు హాజరైనారు.

## కోడూరు సొసైటీ లీగల్ అడ్వైజర్‌గా రాయపూడి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ శాఖకు లీగల్ అడ్వైజర్‌గా జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణు గోపాలరావును నియమించినట్లు ఉత్తర్వులు అందాయి. అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలంలో ఉన్న సొసైటీలకు లీగల్ అడ్వైజర్‌గా నియమించడం ఎంతో సంతోషంగా ఉందని రాయపూడి మంగళవారం విలేకరులను తెలిపారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ నివాసంలో బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి మాట్లాడారు. కృష్ణాజిల్లా సెంట్రల్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నియోజకవర్గ ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నా మీద ఎంతో నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపానని, ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి నా పరిధిలో అందరికి న్యాయ సహాయం అందిస్తానన్నారు.

## వ్యవసాయ రంగానికి మౌళిక సదుపాయాలు కల్పించాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వ్యవసాయ రంగానికి జిల్లా కలెక్టర్ మౌళిక సదుపాయాలు కల్పించి, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జిల్లా కలెక్టర్ డికె బాలాజీకి రాష్ట్ర, జిల్లా కిసాన్ మోర్చ నాయకులు వినతి పత్రాన్ని అందచేశారు. భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి ఆదేశాల మేరకు అందచేసిన వినతి పత్రంలో గత ప్రభుత్వ రైతాంగానికి చేసిన నిర్లష్యం, ఆక్వా రైతుల ఇబ్బందులు, ముఖ్యంగా 1బి లతో పాటు అడంగల్‌లో నమోదు అయిన అన్ని రకాల లంక భూములకు సబ్సీడిపై బిందు సేద్యానికి అవకాశాలు కల్పించాలని ఇంకా మరికొన్ని విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ కౌలు రైతు కన్వీనర్ భూపతి సుబ్రహ్మణ్యం, అవనిగడ్డ నియోజకవర్గ కో కన్వీనర్ తుంగల వెంకట గిరి, సీనియర్ నాయకులు, భోగాది చంద్రశేఖర్, నాగాయలంక మండల అధ్యక్షులు కన్నా వెంకటేశ్వరరావు, మాజీ కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు బండె ఆంజనేయులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు తోడ్పాటును అందించిన కార్యదర్శి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రామచంద్రాపురం సివారు వలందపాలెం చెరువు గట్టు వద్ద నివాసం ఉంటున్న ఎస్.టి కులానికి చెందిన తుమ్మా కోటేష్ కుటుంబానికి తోడ్పాటును అందించారు. రామచంద్రాపురం గ్రామ పంచాయితీ కార్యదర్శి బండె శేషగిరి తన సొంత ఖర్చులతో కోటేష్ నివాస గృహానికి విద్యుత్ మీటరు ఏర్పాటు చేయించారు. దీనితో ఆ కుటుంబ సభ్యులు శేషగిరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాకా రమేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## వాలంటీర్లకు న్యాయం చేయాలని సీఎంకి లేఖలు

**నందిగామ, ఆగస్టు 6, మేజర్ న్యూస్ :** వాలంటీర్లకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుండి బకాయి పడ్డ రెండు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయించాలని, రాజీనామా చేసిన వాలంటీర్లను బలవంతపు రాజీనామాలుగా గుర్తించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు, ఆంధ్రప్రదేశ్ వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ లంక గోవిందరాజులు కోరారు. వాలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ నందిగామలో వాలంటీర్స్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి లెటర్స్ రాసి పోస్టు ద్వారా పంపించారు. అనంతరం నందిగామ ఎమ్మార్వో సురేష్ బాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లకి 10వేల జీతం ఇస్తామని మరి అలాగే ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే ఎంప్లాయిమెంట్ చేయాలని,రాష్ట్రంలో ఉన్నటువంటి గడిచిన రెండు మూడు నెలల నుంచి జీతభత్యాలు నిలిచిపోయినస్ తక్షణమే విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లకి వారి జీతాన్ని తక్షణమే ఇప్పించాలని, ఎలక్షన్ల సమయంలో లక్ష పైచిలుకు వాలంటరీలో రాజీనామాలు చేశారు. అట్టి రాజీనామాల్ని బలవంతపు రాజీనామాలుగా పరిగణలోకి తీసుకొని తక్షణమే వారిని విధుల్లోకి హాజరు కావాల్సిందిగా ఆదేశాలు ఇప్పించాలని కోరారు. మా సమస్యల్ని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకు కోవడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మన్నె హనుమంతు రావు, సిపిఐ నియోజక వర్గ సహాయ కార్యదర్శి కట్టా వామంతి, వాలంటీర్లు సరోజని, యామిని, రమణ, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లింగాలపాడులో తల్లిపాల వారోత్సవాలు



**నందిగామ, ఆగస్టు 6, మేజర్ న్యూస్:** ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని లింగాలపాడు గ్రామంలోని అంగనవాడి కేంద్రం లో సిడిపిఓ భాగ్య రేణుక ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు, సూపర్వైజర్ వెంకట్రావమ్మ తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టగానే తల్లిపాలు పట్టాలని తద్వారా పుట్టిన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరగటంతో పాటు పరిపూర్ణ ఆరోగ్యాని తల్లిపాల అందజేస్తుందని తెలిపారు. పోత పాలు పట్టడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులు బాలింతలు తల్లులకు రోగనిరోధక శక్తి పెరగడానికి పుట్టిన బిడ్డ ఎదుగుదలకు కావలసిన పోషకాలకు సంబంధించిన ఆకుకూరలు కూరగాయలు పాలు గ్రుడ్డు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు బరువు చూశారు. ప్రభుత్వం అందజేస్తున్న బాల సంజీవిని పాలు కీట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్రీలక్ష్మి రత్నమాల ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు గర్భిణీలు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

## కోపరేటివ్ బ్యాంక్ శాఖను సందర్శించిన రాయపూడి



**కోడూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని కోడూరు కోపరేటివ్ బ్యాంక్ శాఖను కోడూరు మండలం సొసైటీల లీగల్ అడ్వైజర్ రాయపూడి వేణుగోపాలరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ పరిధిలో ఉన్న సొసైటీల గురించి పూర్తి సమాచారం సొసైటీల పనితీరు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు శాఖ బ్రాంచ్ మేనేజర్ కొండవీటి సుధీర్, పలువురు సొసైటీల కార్యదర్శులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యాన రైతులకు రాయితీ బకాయిలు విడుదల

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఉద్యాన పంటలకు సంబంధించి 2022-23, 2023-24 సంవత్సరానికి గానూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కెవివై) పథకం క్రింద అవనిగడ్డ, మోపిదేవి, నాగాయలంక, కోడూరు మండలాలలోని రైతులకు సబ్సిడీ బకాయిలు విడుదల అయ్యాయన్నారు. మొత్తం 138 మంది రైతులకు గానూ 62 హెక్టారుల విస్తీర్ణంలో 7,94,756 రూపాయలు ప్రభుత్వం విడుదల చేసిందని మంగళవారం ఉద్యాన వన శాఖ అధికారి ఎన్ రమేష్ విలేకరులకు తెలిపారు. రైతులు మీ యొక్క పంట ఫోటో, బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్ కాఫీలను మీ వివిఎలకు గానీ, విహెచ్ఎ లకు గానీ వెంటనే అందచేయాలన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు రాయితీ కోసం దరఖాస్తు చేసుకోవాలని రమేష్ సూచించారు.

# ప్రజల ఆకాంక్షలను కలెక్టర్లకు స్పష్టం చేసిన సీఎం, డిప్యూటీ సీఎంలు



**కోదూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, అవసరాలను సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జిల్లా కలెక్టర్లకు సూటిగా స్పష్టంగా వివరించారని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ తెలిపారు. కోదూరు లో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సురేష్ బాబు విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్లు,ఎస్పీల సమావేశంలో ప్రజలకు మంచి చేసే విషయంలో నిబంధనలను సైతం సడలించి మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కలెక్టర్ లకు సూచించటం అభినందనీయమన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కలెక్టర్లు త్వరగా నిర్ణయాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేయడం, ప్రజా ప్రతినిధుల నుండి రాజకీయ ఒత్తిళ్లు ఎదురైతే నేరుగా తమను సంప్రదించాలని సీఎం,డిప్యూటీ సీఎంలు చెప్పటం హర్షణీయమని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న రోడ్ల పరిస్థితిని బాగు చేయటానికి నిధులు కేటాయించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు అధికార దర్పం చూపకుండా క్రింది స్థాయి ఉద్యోగులతో సమన్వయం చేసుకొంటూ పనులు చేయించుకోవడం, ఉద్యోగులను అసభ్య పదజాలంతో దూషించే విధానం విడనాడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రశంసనీయమని సురేష్ బాబు అన్నారు. సీఎం,డిప్యూటీ సీఎంలు కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తే ప్రజలకు ప్రభుత్వంపై పూర్తి నమ్మకం,భరోసా ఏర్పడడమే కాకుండా కలెక్టర్లు ప్రజల ఆదరాభిమానాలు పొంది వారి మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తారని సురేష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మాచవరపు శ్రీనివాస్,ఎం, కోటేశ్వరావు, రత్నాకర్, సుబ్బారావు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



**జగ్గయ్యపేట ఆగస్టు 6 మేజర్ న్యూస్ :** మండలంలో చిల్లకల్లు గ్రామంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి లక్ష్మి భార్గవి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే తల్లిపాల వారోత్సవాలు పండగల జరుగుతున్నాయి అని అన్నారు. అనంతరం జగ్గయ్యపేట వైద్యాధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ ముర్రుపాలు విశిష్టత, తల్లిపాల ప్రాముఖ్యతను ఆరోగ్యం ఆహారం గురించి అమ్మ వంట -ఆరోగ్యాల పంట అని అన్నారు. గర్భిణీలకు సీమంతాలు నిర్వహించడమైనది. భేటీ బచావో -భేటీ పడావో కార్యక్రమంలో ఆడపిల్ల సంరక్షణ గురించి, గుడ్ టచ్ -బాడ్ టచ్ గురించి, హెల్ప్ లైన్ నెంబర్ 1098 గురించి ఎల్ సిపీఓ కిరణ్ వివరించారు. ఎంపిడిఓ రమేష్ బాబు వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగమణి, అంగన్వాడీ ప్రాజెక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనసేన బలోపేతానికి కృషి చేస్తా : దాసరి సత్యం



**పెడన, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని దీనిలో భాగంగా జనసేన సభ్యత్వాలను భారీగా నమోదు చేశామని జనసేన ఏపీ ఎన్నికల కోకన్వీనర్ దాసరి సత్యం తెలిపారు ఈ మేరకు ఆయన నియోజకవర్గంలో భారీగా జనసేన సభ్యత్వాలను నమోదు చేశారు ఈ సందర్భంగా దాసరి ఒక ప్రకటనలో మాట్లాడుతూ నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రం మొత్తం జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని జనసేన పార్టీ ఆశయాలను తూచా తప్పకుండా పాటిస్తూ ప్రజాసేవలో నిమగ్నం అవుతామని అన్నారు. జనసేన కార్యకర్తల క్షేమం కోసం తమ పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగో విడత క్రియాశీల సభ్యత్వ నమోదులో నియోజకవర్గంలో 2000 పైగా సభ్యత్వం నమోదు చేశామని ఇంకా వేలాదిమంది తమ సభ్యత్వాలు నమోదు చేయాలని తమను కోరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు తదితరులు ఉన్నారు.

## వేగవంతంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ పనులు...!



కోడూరు, మేజర్ న్యూస్ : ఎనిమిదో వార్డులో చేపట్టిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రాజ్యసభ సభ్యులు కనకమెడల రవీంద్ర, మంజూరు చేసిన 50 లక్షల నిధులతో, జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక మంజూరు చేసిన 25 లక్షల నిధులతో భవన నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కృషితో భవనం (100%) పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోనునట్లు మాజీ ఎంపీపీ పెద్ది భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి

### ఎన్టీఆర్ జిల్లా ఎస్టీయూ శాఖ అధ్యక్షులు వేముల భిక్షమయ్య



**కంచికచర్ల ఆగస్టు 6 మేజర్ న్యూస్ :** విద్యాశాఖ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలలో పని సర్దుబాటుకు సిద్ధమవుతున్నందున దీనికి ముందే ఉపాధ్యాయ సంఘ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, గత ప్రభుత్వ విధానాల వలన గాడి తప్పిన విద్యా వ్యవస్థను సరి చేయటానికి తీసుకొన వలసిన విధివిధానాలపై చర్చించి,జీవో నెంబర్ 117ను రద్దు చేసిన తర్వాతే పని సర్దుబాటు చే యాలని ఎస్ టి యు ఎన్టీఆర్ జిల్లా శాఖ అధ్య క్షుడు వేముల భిక్షమయ్య డిమాండ్ చేశారు ఈ మేరకు ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రక టన విడుదల చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యులు తీసుకున్న వెంటనే వారు పాదయాత్రలో ఇచ్చినటువంటి హామీ అయిన జీవో నెంబర్ 117 రద్దు చేస్తారని ఉపాధ్యాయ లోకమంతా ఆశించిందన్నారు. కానీ దానికి విరుద్ధంగా జీవో నెంబర్ 117 రద్దు చేయకుండానే ప్రభుత్వం పని సర్దుబాటుకు సిద్ధమవటం చాలా విచారకర మని అన్నారు. జీవో నెంబర్ 117 మూడు, నాలుగు,ఐదు తరగతులను ఉన్నత పాఠశాలల్లో మేర్జ్ చేయటం వలన ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా మూత దశకు చేరుకున్నాయని,జీవో నెంబర్ 117 రద్దు చేయకపోతే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కూడా మూత దశకు చేరుకోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఉపాధ్యాయుల విద్యార్థుల నిష్పత్తి శాస్త్రీయంగా ఉన్నదని, జీవో నెంబర్ 117 వలన ఉపాధ్యాయుల విద్యార్థుల నిష్పత్తి అసస్త్రీయమైనదని పేర్కొన్నారు. కావున నూతన ప్రభుత్వం జీవో నెంబర్ 117 రద్దు పై తక్షణమే నిర్ణయం తీసుకొని తరువాతనే పని సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టాయిలెట్ ఫోటోలు తీయటం నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చి, ఉపాధ్యాయుల గౌరవం కాపాడినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేసినారు. గత ప్రభుత్వంలో చెల్లించకుండా ఉన్న డి.ఏ బకాయిల చెల్లింపుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# టిడ్కో ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి లబ్ధిదారులకు అందజేస్తాం



## ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

**జగ్గయ్యపేట ఆగస్టు 6 మేజర్ న్యూస్ :** పట్టణంలో బలుసుపాడు రోడ్డులో గల టిడ్కో గృహాలను మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు బిజెపి సీనియర్ నాయకులు కీసర రాంబాబు,అన్నెపాగా శ్రీకాంత్,జనసేన నాయకులు ఈమని కిషోర్, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య ) పరిశీలించారు. గత వైసిపి ప్రభుత్వంలో పడకేసిన టిడ్కో ఇళ్ల నిర్మాణం. గత ప్రభుత్వంలో చేసిన తప్పులను సరిదిద్దీ టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు త్వరలోనే అందజేస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ 2018లో తెదెపా గవర్నమెంట్ లో ఈ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 3168 ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టినట్లు పేర్కొన్నారు. 300 స్క్వేర్ ఫీట్ సింగల్ బెడ్ రూమ్ ఇళ్లకు లబ్ధిదారులు 500 రూపాయలు చెల్లిస్తే మిగతాది స్టేట్ అండ్ సెంట్రల్ గవర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 365,430 స్క్వేర్ ఫీట్ లబ్ధిదారులు సుమారు 1600 మంది ఉన్న లబ్ధిదారులు స్టేట్ అండ్ సెంట్రల్ గవర్నమెంట్ నిధులతో పాటు మ్యాచింగ్ లోన్స్ కూడా తీసుకోవాలని ఇందులో 413 మందికి లోన్ మంజూరైనట్లు మిగతావాళ్లు కూడా తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ తో కలిసి టిడ్కో ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తెలుగుదేశం గవర్నమెంట్లో మొదలుపెట్టిన టిడ్కో ల నిర్మాణం 75% పూర్తయినట్లు మిగతా 25 శాతానికి గత ప్రభుత్వంలో పనిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎద్దేవ చేశారు. త్వరలో లబ్ధిదారులు, బ్యాంక్ అధికారులు, టిడ్కో ఐ.కె.పి వారితో సమావేశం ఏర్పాటు చేసి నిజమైన లబ్ధిదారులకు ఇల్లు అందజేస్తామని తాతయ్య తెలిపారు. గతంలో ఉన్న లబ్ధిదారులు లిస్టు, ఇప్పుడున్న లబ్ధిదారుల లిస్టు తీసుకొని అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే అందే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ డి ఏ కూటమి నాయకులు, టిడ్కో,ఎల్ అండ్ టి, మెప్మా, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మొదటి శ్రావణ మంగళవారం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గౌరీదేవి పరమ శివుని ఇల్లాలు. పసుపు వర్ణంలో ఉంటుంది కనుక గౌరీ అని, శుభాలు చేకూరుస్తుంది కనుక మంగళ గౌరి అని పిలుస్తారు. వివాహ సమ యంలోనూ, పెళ్లి తరువాత ఇంటి సాంప్రదాయాలను అనుసరించి శ్రావణమాసంలోనూ స్త్రీలు మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. శ్రావణ మంగళవారం నాడు ఉదయాన్నే తలస్నానం చేసి, ఇళ్ళు శుభ్ర పరుచుకుని పూజ గదిలో కానీ, వ్రతం చేయదలచుకున్న ప్రాంతంలో కానీ మండపాన్ని ఏర్పాటు చేసుకుంటారు. ఈ మండపంపైన బియ్యపు పిండితో అష్టదళ పద్మాలను ముగ్గుగా తీర్చిదిద్ది దీనిపై బియ్యం పోసి కళసాన్ని (చెంబు) ను ఏర్పాటు చేసుకుంటారు. దాని లోపల మామిడి ఆకులు వేసి పైన కొబ్బరి కాయ నిలిపి కొబ్బరి కాయకు పసుపు, గోధుమ పిండి మిశ్రమంతో ముక్కు, కళ్ళు, చెవులు తీర్చిదిద్దాలి. దీనికి బదులుగా రూపు లేదా ప్రతిమను స్థాపించ కోవచ్చు. కొబ్బరికాయపై కొత్త రవికను ఉంచా లి. కళిశానికి బదులుగా గౌరీదేవి ఫోటోను కూడా పూజిం చవచ్చు. పూజ పీటాన్ని ఎవరు శక్తి కొలది వారు అలంక రించుకోవచ్చు. ఈ విధంగా అమ్మవారిని ప్రతిష్ఠించుకుని వ్రతం చేసుకోవాలి. ప్రతి వారం ఒకే మంగళ గౌరీ విగ్రహాన్ని ఉపయోగించాలి. వా రానికి ఒక కొత్త విగ్రహాన్ని ఉపయోగించకూడదు. వివాహం అయిన తరు వాత కొత్త పెళ్ళి కూతురు తొలిగా నోచుకునే నోమే మంగళగౌరీ. పెళ్ళికి ముం దు గౌరీ పూజ. పెళ్ళి తరువాత మొదటిగా ఐదు సంవత్సరాల పాటు మంగళ గౌరీ వ్రతం చేయడం సకల సౌభాగ్యాలను ఇస్తుందని మన పూర్వీకుల నుండి నమ్మకం. తొలిసారిగా ఈ నోము పుట్టినింట చేయడం మంచిది. తొలి వాయనం తల్లికి ఇవ్వాలి. ఒక వేళ తల్లి లేకపోయినట్లయితే అత్తగారు లేదా ఇతర ముత్తైదువుల సహాయంతో నోము ఆచరించవచ్చు. కానీ వాయనం మాత్రం అత్తగారికి ఇవ్వరాదు. ముత్తైదువుల సూచనలతో ఆచార సాంప్రదాయాలను శక్తి మేరకు పాటించి వ్రతం రోజున ఐదుగురు ముత్తైదువులను వాయనాలు అందుకో వడానికి పిలుచుకోవాలి. శక్తిని బట్టి, ఆచార సాంప్రదా యాలను బట్టి వాయనాలు ఇవ్వవచ్చు. ఈ వ్రతం చేయడం వల్ల భర్త ఆరోగ్యం, ఆయుష్షు బాగుంటుందని, అలాగే తరగని సిరి సంపదలతో, సుఖసౌఖ్యాలతో జీవిస్తారని మన మహిళల విశ్వాసం.

## ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలి



**కోడూరు, మేజర్ న్యూస్ :** కోడూరు మండలంలో ఈ క్రాఫ్ట్ నమోదు( పంట నమో దు) వేగవంతం చెయ్యాలని కోడూరు మండల వ్యవ సాయ శాఖ అధికారి ఎం శ్రీధర్ కోరారు. మంగ ళవారం కోడూరు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మండల వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహసిల్దార్ పద్మప్రియ అధ్యక్షతన గ్రామ రెవెన్యూ అధికారులుకు, గ్రామ వ్యవసాయ సహాయకులుకు, ఈ పంట నమోదు చేసే విధానంపై ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 15వ తేదీ వరకు పంట నమోదు ప్రక్రియ కొనసాగుతుందని,కావున మండల పరిధిలోని రైతులందరూ రైతు సేవా కేంద్రాల వద్ద కువెళ్లి వేసిన పంట వివరాలు తెలిపి ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలనన్నారు.

## శరవేగంగా శానిటేషన్ పనులు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గత వారంలో కురిసిన వర్షాలకు గ్రామంలో సీజనల్ వ్యాదులు, దోమలు ప్రభలకుండా ముందస్తు చర్యలలో భాగంగా శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు గత మూడు రోజుల నుండి గ్రామంలోని పలు ప్రాంతాలలో సున్నం, బ్లీచింగ్ చల్లి మురుగు పోయేందుకు మార్గాలను సైతం చేశారు. వైద్య సిబ్బంది ఆద్వర్యంలో మంగళవారం అవనిగడ్డ శివారు కొత్తపేటలో శానిటేషన్ పనులు ఈఓపిఆర్డి కమ్మిలి సుందరి, పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు ఆద్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

## పేకాట, గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం...



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా ఉక్కుపాదం మోపుతామని నూతనంగా భాద్య తలు చేపట్టిన కె శ్రీనివాస్ అన్నారు. బదిలీలలో భాగంగా మచిలీపట్నం దిశా పోలీస్ స్టేషన్ నుండి అవనిగడ్డ ఎస్ఐగా బదిలీపై వచ్చిన కె శ్రీనివాస్ మంగళవారం భాద్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవారిపై ఉక్కుపాదం మోపుతానని, ప్రత్యేకించి ట్రాఫిక్‌పై కూడా దృష్టి పెడతానన్నారు. భాద్యతలు తీసుకోకముందు మోపిదేవిలో వేంచేసి ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే గత 30 సంవత్సరాలుగా అవనిగడ్డలో ఒక పర్యాయం చేసి వెళ్ళిన ఎస్ఐ రెండవ సారి రావడం ఇదే మొట్ట మొదటి సారి.

## స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు శిక్షణ కార్యక్రమం



**జగ్గయ్యపేట ఆగస్టు 6 మేజర్ న్యూస్ :** ఈ నెల 8వ తారీఖున జరగబోవు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎ న్నికలకు సంబంధిం చిన ట్రైనింగ్ మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టిబాబు అధ్యక్ష తన చిల్లకల్లులోని ఎంఈఓ ఆఫీస్ లో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ ఎల్ చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 8 తారీఖు నాడే ఎలక్షన్ జరిపి పాఠశాల విద్యాభివృద్ధికి పాటుపడాలని ఉద్దేశంతో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి కావున ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రాజకీయ ఒత్తిడి లకు లోను కాకుండా మీకు ఇచ్చిన గైడ్లైన్స్ ప్రకారంగా 61 పాఠశాలలో ఎన్నికలు నిర్వహించి అదే రోజు సాయంత్రం ఎన్నికైనటువంటి చైర్మన్,వైస్ చైర్మన్,, ఇతర సభ్యులతోలతో కూడిన జాబితాలు ఇవ్వగలరని సిబ్బంది కి తెలియజేసారు. దీనికి పర్యవేక్షణ మండల పరిషత్ అభివృద్ధి అధికారి స్థానిక తహసిల్దార్, మండల విద్యాశాఖ అధికారి ఉంటారు అని తెలియజేసారు. అవసరమైతే పోలీసు వారి సహకారం కూడా తీసుకుంటామని తెలియజే సారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 61 మంది ప్రధానోపా ధ్యాయులు సిఆర్పిలు పాల్గొన్నారు.

## రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలి



**వత్సవాయి ఆగస్టు 6 మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో మండలంలో ఉన్న 19 రైతు సేవా కేంద్రాల పరిధిలో గల గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు, ఎంపీఈవోలు రైతుల పంట నమోదు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్ భవాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్ర సిబ్బంది గ్రామస్థా యిలో ప్రతి రైతు పొలంలో సాగు అవుతున్న పంటల వివరాలు తప్పనిస రిగా నమోదు చేయించాలని చూపించారు. పంట నమోదులో ఏ విధమైన తప్పులు లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులందరికీ దగ్గర నుండి స మాచారం సేకరించి పంట నమోదు త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని సూచించారు. తదుపరి వత్సవాయి గ్రామ లో గల అన్నారి రఘు బాబు అనే రైతుపొలంలో పంట నమోదు చేయించి అందరికీ వివరించారు. అదేవిధం గా మండలంలో రైతు సోదరులు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్, ఫోన్ నెంబర్ వివరాలతో మీ గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో సంప్రదించ గలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి రవికుమార్ అన్ని గ్రామాల వీఏఏలు విహెచ్ఎలు రైతులు పాల్గొన్నారు.

## అల్ట్రాటెక్ ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి చెక్ అందించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట ఆగస్టు 6 మేజర్ న్యూస్ :** మండలంలో, బూదవాడ గ్రామంలో గత నెలలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాదంలో గాయపడిన గుగులోతు గోపి నాయక్ చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. విష యం తెలుసుకున్న జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాత య్య) గ్రామంలో గోపి నాయక్ గృహంలో భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులకు 50 లక్షల రూపాయల చెక్కును తాతయ్య వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

# ఉచిత మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించిన మంత్రి




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ వైద్య సేవ కింద బీమా పద్ధతిలో 25 లక్షల వరకు వైద్యం అందించే పాలసీ త్వరలో ముఖ్యమంత్రి ప్రకటించనున్నారని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక పోతేపల్లి జ్యువెలరీ పార్కులో బిగ్ టీవీ, మానవత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును మంత్రి వైద్యుల బృందంతో కలిసి ప్రారంభించారు. వైద్య సేవలు పొందిన రోగులకు మంత్రి మందులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా బిగ్ టీవీ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఉచిత మెగా మెడికల్ క్యాంపులు అభినందనీయమని, ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించుటకు మరిన్ని మీడియా సంస్థలు ముందుకు రావాలని సూచించారు. నేటి ఆహారపు అలవాట్లు, కాలుష్య వాతావరణం తదితర కారణాలతో రోగాల బారిన పడుతున్న అనేకమంది ఆసుపత్రులలో ఎంతో వ్యయం చేయవలసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సామాజిక సేవా దృక్పథంతో పేదలకు వైద్య సేవలు ఉచితంగా అందించుటకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, యోగ ప్రయోజనాలు పట్ల అవగాహన కల్పించేందుకు మచిలీపట్నంలో వివిధ అసోసియేషన్ల సహకారంతో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద కేంద్ర వైద్య పథకాలతో జోడించి బీమా పద్ధతిలో 25 లక్షల వరకు వైద్య సేవలు పొందే విధాన నిర్ణయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో ప్రకటించనున్నారని మంత్రి తెలిపారు. ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 100 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నదని, అందులో భాగంగా మచిలీపట్నంలో బైపాస్ రోడ్ లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సుమారు 10 వైద్య విభాగాల్లో స్పెషలిస్ట్ వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు అధ్యక్షత వహించగా మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీరామ్, బిగ్ టీవీ ప్రతినిధి శివ, పార్లమెంటు మాజీ సభ్యులు కోనకళ్ళ నారాయణరావు, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా కలెక్టర్ చొరవతో జిల్లాకు రూ.5 కోట్లు కేటాయింపు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జిల్లాలలో తక్షణ అవసరాల నిమిత్తం ఐదు కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ఏమైనా సందేహాలు సమస్యలు ఉంటే చెప్పాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరిన మీదట కృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో పర్యటించినప్పుడు ఉపరితల జలాశయాలు (ఓహెచ్ఎస్ఆర్) శుభ్రం చేయుటకు వీలుగా నిచ్చెనల అవసరం ఉన్నదని అయితే కొన్నింటికి ట్యాంకులకు నిచ్చెను లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పగా రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందిస్తూ అన్ని జిల్లాలకు 5 కోట్ల రూపాయల చొప్పున తక్షణ అవసరాలకు ఖర్చు చేసేందుకు కేటాయిస్తామని ప్రకటించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మరికొన్ని అంశాలను ప్రస్తావిస్తూ జిల్లాలో జిల్లా స్థాయి అధికారుల పదవులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని కోరడంతో వివరాలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి అందిస్తే ఖాళీ పదవులను భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఆర్డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు లేరని కేవలం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉండడంతో ఏమైనా పనులు చేపట్టాలంటే 40 లక్షల రూపాయలు మించి ఏమైనా పనులు చేపట్టాలంటే ఇబ్బంది అవుతుందని ఈ పరిస్థితిని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరడంతో ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఈ విషయమై ఇబ్బంది లేకుండా అవసరమైతే అధికారాలను బదిలీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని శాఖాధిపతులకు సూచించారు.

హైకోర్టు ధిక్కరణ కేసులు వాదించేందుకు ప్రభుత్వం తరఫున హైకోర్టులో మంచి ప్రభుత్వ న్యాయవాదులను ఏర్పాటు చేయాలని అలాగే జిల్లాకు ఒక న్యాయవాదిని ఏర్పాటు చేసేం దుకు అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోరడంతో అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సమ్మతి తెలుపుతూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 70 నుంచి 80 శాతం పనులు పూర్తయి మిగిలిన 20 నుంచి 30 శాతం నిధులు లేక కొన్ని ప్రాజెక్టులు అలాగే ఉండిపోయాయని ముఖ్యంగా మచిలీపట్నం నగరంలో 34 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మురికి కాలువలు నిర్మించారని అయితే వాటి ఔట్ఫాల్ సరిగా లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయిందని అటువంటి వాటికి నిధులు కేటాయిస్తే ఆ పనులు పూర్తయి సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి స్పందిస్తూ కృష్ణా జిల్లానే కాకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు అటువంటివి గుర్తించి అంచనా వేసి ప్రతిపాదనలు ఏమైనా ఉంటే పంపాలని వాటన్నిటిని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని ఆ దిశగా సంబంధిత శాఖ అధిపతులు, కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పలు రైల్వే ప్రాజెక్ట్‌లకు సంబంధించి రైల్వే మంత్రితో చర్చించిన ఎంపీ బాలశౌరి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో పలు రైల్వే ప్రాజెక్ట్‌ల నిమిత్తం నిధులు సమాకూర్చాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కోరారు. ముఖ్యంగా మచిలీపట్నం - రేపల్లె రైల్వే లైన్ నిర్మాణం ఆవశ్యకతను మంత్రికి ఎంపీ వివరించారు. మంగళవారం ఢిల్లీలో మచిలీపట్నం పరిధిలోని పలు రైల్వే అభివృద్ధి పనులపై రైల్వే మంత్రితో ఎంపీ బాలశౌరి చర్చించారు. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. అదే విధంగా ఇటీవల ప్రతిపాదించిన మచిలీపట్నం - నర్సాపురం రైల్వే లైను మంజూరు చేయడం అభినందనీయమని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. ఈ రైల్వే లైన్ ని చిలకలపూడి, పల్లెపాలెం, బంటుమిల్లి, మాట్లాం మీదుగా ఏర్పాటు చేయాలని ఎంపీ కోరగా దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మచిలీపట్నం - రేపల్లె లైను ఎప్పటినుంచో డిమాండ్ ఉందని, ఈ లైను ఏర్పాటు చేస్తే దివిసీమ ప్రజల చిరికాల కోరిక తీరుతుందని ఎంపీ బాలశౌరి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కి తెలిపారు. అదేవిధంగా ఇప్పుడున్న రైల్వే లైను ప్రకారం మచిలీపట్నం నుంచి వయా గుడివాడ, విజయవాడ, తెనాలి చేరుకోవాలంటే సుమారు 145కి. మీ ప్రయాణించాలన్నారు. అదే మచిలీపట్నం రేపల్లె రైల్వే లైను ఏర్పాటు చేస్తే కేవలం 45 కి.మీ. దూరంలో తెనాలి చేరుకుని అక్కడి నుంచి చెన్నై, తిరుపతి, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సులువుగా ఉంటుందని ఎంపీ తెలిపారు. సుమారు 100 కి.మీ. దూరం తగ్గటంతోపాటు విజయవాడ జంక్షన్ మీద ట్రాఫిక్ భారం పడకుండా ఉంటుందన్నారు. దీంతోపాటు గత ఏడాది సెప్టెంబర్లో నిలిపివేసిన మచిలీపట్నం నంచి ధర్మవరం వయా తిరుపతికి రైలు పునరుద్ధరించాలని ఎంపీ బాలశౌరి కోరారు. ఈ రైలును ఏర్పాటు చేస్తే మచిలీపట్నం ప్రాంత భక్తులు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవాలనుకునే కోరిక తీరుతుందన్నారు. గుడివాడ ప్రాంతంలోని వడ్లమన్నాడు గ్రామం, మచిలీపట్నంలో చిలకపూడి వద్ద రైళ్లను నిలుపుదల చేయాలని రైల్వే మంత్రిని ఎంపీ బాలశౌరి కోరారు.

### లోతట్టు ప్రాంత ప్రజలు

# సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలి



**వరద హెచ్చరిక కారణంగా ముందు జాగ్రత్తగా నగరపాలక సంస్థలో 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

**నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కృష్ణానది లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ముంపు ప్రభావిత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజికి ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు అధికంగా వస్తున్న కారణంగా కృష్ణానది లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. మంగళవారం కమిషనర్ విడుదలచేసిన ప్రకటన లో పులిచింతల ప్రాజెక్ట్‌లో ఏర్పడిన సాంకేతిక ప్రమాదము కారణంగా వరద నీరు ప్రకాశం బ్యారేజికి వచ్చే అవకాశం ఉన్నందున నది ప్రవాహక లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో వరదలు హెచ్చరిక సందర్భంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలు ఎదుర్కొనుచున్న వివిధ సమస్యలను అధికారులకు తెలియజేసి యుద్ధప్రాతిపధికన వాటిని పరిష్కరించుకొనుటకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ధ్యాన చంద్ర తెలియజేసారు. 3 షిఫ్ట్ లలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్ పని చేస్తుందని కమిషనర్ వివరించారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వరదల ప్రభావం కారణంగా నగర పరిధిలో ఎక్కడైనా రోడ్లపై నీటి నిల్వలు, తాగునీటి పైపు లైనులు లీకులు రిపైర్లు, సీజనల్ వ్యాదులు, చెట్లు విరిగి పడిపోవుట, కొండ రాళ్లు జారిపడుట, డ్రెయిన్స్ / కాలువలు పొంగిపోర్లుట వంటి సమస్యకు ఎదురైనచొ సమస్యలను నేరుగా వాట్సప్ నెం 8181960909, ల్యాండ్ లైన్ నెం. 0866-2427485, 0866-2424172లకు కాల్స్ చేసి సమస్యలను తెలియజేసిన యెడల కంట్రోల్ రూమ్ సిబ్బంది సంబందిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలియజేసారు.

## అవనిగడ్డ తహసీల్దార్‌గా మురళీధర్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ మండలం నూతన తహసీల్దార్ గా జీ.మురళీధర్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు.సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మండలి వెంకట్రావు ( రాజా ) రెవెన్యూ అధికారులు మండలి కేశవి, డి.టి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999